క్లుప్తంగా

పనిభారం తగ్గించాలి



వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు

కెరమెరి: పని భారం తగ్గించాలని ఐకేపీ వీవోఏలు అన్నారు. గురువారం ఏపీఎం ముక్తేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. మండల సమాఖ్య కార్యాలయంలో ఆయనను కలిసి మాట్లాడారు. అదనంగా నవభారత్ సాక్షరత కార్యక్రమం, ఉల్లాస్ పనులను అప్పగించడంతో పని భారం పెరిగిందన్నారు. వెంటనే తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీవోఏ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం శ్రీధర్, వీవోఏలు రమేశ్, మారుతి, రాంచందర్, తురాకారం మహేందర్, పూనమ్‌చంద్ ఆనంద్‌రావు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: పనిభారం తగ్గించాలని జిల్లా కేంద్రంలో డీపీఎం నరేందర్‌కు గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఐకేపీలో పనిచేస్తున్న వీవోఏలు వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ ఐకేపీ వీవోఏలతో 67 రకాల పనులు చేయించుకుంటున్నారని తెలిపారు. ఎస్‌హెచ్‌జీ ఫార్మేషన్ నుంచి సంస్థ పనులు, ప్రభుత్వ పథకాలు, విద్యా సంస్థలు, స్కూల్ యూనిఫాం, ఉల్లాస్ తదితర పనులు ఒత్తిడికి గురి చేస్తున్నాయన్నారు. విద్యాబోధన, ట్రెనింగ్ పేరుతో ఇబ్బంది పెట్టే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్, నాయకులు వినోద్, శ్రీధర్, సరిత, శారద తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం సర్వే చేయాలి



మాట్లాడుతున్న మడే మల్లేష్

పెంచికల్‌పేట్: పెద్దవాగు వరదలతో నష్టపోయిన పంటలను సర్వే చేయాలని రాజ్‌గోండ్ మండల అధ్యక్షుడు మడే మల్లేష్ అన్నారు. గురువారం గుండెపల్లి శివారులో నష్టపోయిన పంటలను పరిశీలించారు. పెద్దవాగు ఉధృతికి గుండెపల్లి, కమ్మర్‌గాం, నందిగామ, అగర్‌గూడ, ప్రాణహిత ఉధృతికి మురళీగూడ, జిల్లెడ శివారుల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు సర్వే చేయించడం లేదని ఆరోపించారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు



తనిఖీ చేస్తున్న అధికారులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం ఆదేశాల మేరకు గురువారం జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ అజీమ్ తనిఖీ చేశారు. నిబంధనలు పాటించకపోవడం, రోగులకు సరైన ర్యాంప్ సౌకర్యం, ధరల పట్టికలు ఏర్పాటు చేయకపోవడంపై ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేపట్టామని తెలిపారు. నిబంధనలు పాటించని ఆస్పత్రుల నిర్వాహకులకు నోటీసులు అందించామన్నారు. త్వరలోనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సూపరింటెండెంట్ ఎండీ షఫీ, డీఎస్‌వో రమేశ్, చంద్ర ఉన్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

కౌటాల: మండలం తలోడి గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను గురువారం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. తలోడి గ్రామంలో పేకాట ఆడుతున్న నిట్టూరి సత్తయ్య, ఎర్రోల వెంకటేశ్, దుర్గం గణేశ్, బోర్కుట్ విఠల్, బొద్దు రవిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ. 10,980 నగదు, 52 పేకాట కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఐదుగురిపై కౌటాల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై రాజు, కానిస్టేబుల్స్ మహమూద్, విజయ్, మధు, రమేశ్, గౌస్, ప్రకాశ్, సాయి, రవి పాల్గొన్నారు.

ఫారెస్టు అధికారుల తనిఖీలు

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ మండలంలోని సీబాపు కాలనీ సమీపంలోని కట్టె డి పోను ఫారెస్ట్ అధికారులు గురువారం తనిఖీ చేశారు. డిపోలో అక్రమంగా నిల్వ ఉన్న 7 టన్నుల కలప దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు డీఆర్‌వో హేమలత తెలిపారు. దీని విలువ సుమారు రూ.55,000 ఉంటుందని యజమాని షమీ ఉద్దీన్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో బీట్ ఆఫీ సర్లు బానయ్య, గోంది, రవి పాల్గొన్నారు.

గిరి గ్రామాల్లో పొలాల సందడి

- ఊపందుకున్న క్రయ విక్రయాలు
- శ్రావణం ఎంతో ప్రవిత్రం

కెరమెరి: కుమురం భీం జిల్లాలోని ఆయా గ్రామాల్లో పొలాల అమావాస్య సందడి నెలకొంది. ఎడ్లకు ప్రత్యేక పండుగగా భావించే పండుగ జరుపుకునేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఇందు కోసం ఎద్దుల మెడలో గంటలు, వీపుపై రంగురంగుల జూలు, కొమ్ములకు పూసేందుకు రంగులు, రకరకాల కాగితాలను కొనుగోలు చేస్తున్నారు. ఐడిగా పేరుతో నిర్వహించే కార్యక్రమం అనంతరం శ్రావణ మాసం ముగుస్తుంది.

మాంసాహారానికి బ్రేక్..

శ్రావణమాసం ప్రారంభం నుంచి అనేక మంది హిందూవులు మాంసానికి దూరంగా ఉంటారు. భక్తులు నెల రోజులు గుళ్లు, గోపురాలు తిరుగుతూ తమతమ ఇష్టదైవాన్ని పూజిస్తారు. కెరమెరి మండల కేంద్రంలోని శివాలయం, నెహ్రూనగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయాలతో పాటు ఆసిఫాబాద్, వాంకిడి, రెబ్బెన, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్, తిర్యాణి, నార్నూర్ మండలాల్లో ఉదయం, సాయంత్రం భక్తులు పూజలు చేస్తున్నారు.



ఎడ్ల అలంకరణ సామగ్రి కొనుగోలు చేస్తున్న రైతులు

జనసంద్రమైన శివాలయం..

శ్రావణమాసం ముగింపు నేపథ్యంలో ఆలయాలు కిక్కిరిసి పోతున్నాయి. మండలంతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి పూజలు చేస్తున్నారు. శ్రావణమాసం పవిత్రతకు గుర్తింపు నిలిచేదని భక్తుల నమ్మకం. ఈమాసంలో మంచి పనులు చేయాలని ప్రజల్లో పూర్తి విశ్వాసం ఉంది. దీంతో శివాలయం భక్తలతో నిండి పోయింది.

సంక్షేమ ఫలాలు అందేలా చూడాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: గిరిజనులకు సంక్షేమ ఫలాలు అందేవిధంగా చూడాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో దర్తీ అభజన జాతీయ గ్రామీణ ఉత్కర్ష అభియాన్‌లో ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమంలో భాగంగా బ్లాక్‌స్థాయి మాస్టర్ ట్రెనర్లకు ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనుల స్థితిగతులు మార్చేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో 12 మండలాల నుంచి 7 శాఖల అధికారులు, బ్లాక్ స్థాయి మాస్టర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్య, వైద్య, తాగునీరు, ఆరోగ్యం, రహదారులు వంటి వాటిపై సంక్షేమ పథకాలు ఉండేవిధంగా గ్రామస్థాయి నుంచి ప్రణాళిక రూపొందించాలన్నారు. కార్యక్రమంలో డీటీడీవో రమాదేవి, శిక్షకులు, అధికారులు పాల్గొన్నారు.

అర్థవంతమైన విద్యనందించాలి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు అర్థవంతమైన విద్యనందించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో గిరిజన బాలుర పాఠశాలను సందర్శించి వంటశాల, తరగతి గదులు, విద్యార్థుల సామర్థ్యాల స్థాయి పరి శీలించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో గుణాత్మక విద్యను బోధించాలన్నారు. ఇంగిష్, మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులపై దృష్టి సారించాలన్నారు.

‘ప్రీప్రైమరీ’లో పోస్టుల భర్తీ



ఎంపికైన సావర్‌ఖేడా పాఠశాల

- 41 స్కూళ్లలో ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల నియామకం
- ఈ నెల 25 వరకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రీప్రైమరీ విద్యను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. జిల్లాలో 41 పాఠశాలలు ఎంపిక కాగా, ప్రభుత్వం ఆయా స్కూళ్లలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

తాత్కాలిక పద్ధతిలో నియామకం

2025–26 విద్యా సంవత్సరంలో జిల్లాలో 41 పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు నిర్వహించనున్నారు. తాత్కాలిక పద్ధతిలో ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి అర్హత కలిగిన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అదనపు కలెక్టర్, డీఈవో దీపక్ తివారి గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇన్‌స్ట్రక్టర్ ఇంటర్మీడియెట్, ఆయా ఏడో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలి. 18 నుంచి 44 ఏళ్లలోపు వారు ఈ నెల 25లోగా ఆయా పాఠశాలలో దరఖాస్తు చేసుకోల్సి ఉంటుంది. ఆయాకు రూ.6వేలు, ఇన్‌స్ట్రక్టర్‌కు రూ.8వేలు చెల్లించనున్నారు.

ఎంపికైన పాఠశాలలు ఇవే..

ఆసిఫాబాద్ మండలంలో చిలాటిగూడ, ఉస్మానియా మజిద్ పాఠశాలలు ప్రీప్రైమరీ బోధనకు ఎంపికయ్యాయి. అలాగే బెజ్జూర్ మండలంలో పాపన్‌పేట్, బెజ్జూర్, కుకుడ, సలుగుపల్లి, చింతనమానెపల్లిలో దిందా, డబ్బా, రుద్రాపూర్, దహెగాంలో ఇట్యాల, కుంచవెల్లి, హత్తిని, గిర్రె, దహెగాం, జైనూర్‌లో జామిని, కాగజ్‌నగర్‌లో ఎఫ్ క్వార్టర్స్ స్కూల్, అనుకోడ, గన్నారం, నజ్రూల్‌నగర్, చింతగూడ, కాగజ్‌నగర్ వార్డు నం.12 పీఎస్ స్కూల్, కెరమెరిలో ధనోరా, గోయగాం, సావర్‌ఖేడా, కౌటాలలో గుండాయిపేట్, ముత్తంపేట్, బండల్‌హెట్టి, పెంచికల్‌పేట్‌లో కొండపెల్లి, చేడ్వాయి, రెబ్బెనలో రెబ్బెన ఎస్సీ కాలనీ, గంగాపూర్, సిర్పూర్(టి)లో భూపాలపట్నం, లోనవెల్లి, గంగాయిగూడ, మాల్‌గూడ, చింతకుంట, తిర్యాణిలో మాలన్‌గొంది, గంభీరావుపేట్, వాంకిడిలో కొమాటిగూడ, గోయగాం, ఖిరిడి పాఠశాలలు ఎంపికయ్యాయి.

భయం.. భయంగా..!



శిథిలావస్థకు చేరిన కౌటాల పీహెచ్‌సీ భవనం

- శిథిలావస్థకు చేరిన భవనాలు
- కూల్చకుండా అధికారుల నిర్లక్ష్యం

కౌటాల: వానాకాలం ఏదో ఒకచోట ప్రమాదాలు సంభవించి ప్రాణ, ఆర్థిక నష్టం వాటిల్లుతోంది. దీంతో సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేయడం.. తూతూమంత్రంగా శిథిలా భవనాలను కూల్చివేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. దీంతో పలుచోట్ల వర్షాకాలంలో పురాతన భవనాలు, ఇళ్లు కూలిపోతున్నాయి. కాలం చెల్లినా.. శిథిలమైన భవనాలను గుర్తించి సత్వరమే కూల్చి వేయాలని ప్రభుత్వం గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. క్షేత్రస్థాయిలో హడావుడిగా సర్వేలు చేసిన అధికారులు తర్వాత పట్టించుకో లేదు. ముసురుకు కౌటాల మండలం మొగడ్‌దగడ్‌లో రెండు ఇళ్లు, దహెగాం మండలంలో రెండు ఇళ్లు కూలిపోయాయి. తాజాగా దహెగాంలో కూలిన ఇళ్లను పరిశీలించిన కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండొద్దని సూచించారు.

ముసురు భయం..

జిల్లాలో కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండంతో పురాతన భవనాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. పట్టణాలతో పాటు గ్రామాల్లో ఇంకా ఏళ్లనాటి నివాసాలు, కార్యాలయాలు ఉన్నాయి. భారీ వర్షాలకు గోడలు, స్లాబ్ తడిసి పోయి కూలిపోయే అస్కారముంది. ప్రమాదమని తెలిసినా.. నిర్లక్ష్యంగా కొందరు, గత్యంతరం లేక మరికొందరు పాత భవనాల్లోనే ఉండిపోతున్నారు. పట్టణ, పల్లె ప్రగతిలో భాగంగా శిథిల భవనాలు తొలగించాలని ప్రభుత్వాలు మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ, పట్టణాలు, గ్రామాల్లో ఇంకా పురాతన ఇళ్లు కనిపిస్తూనే ఉన్నాయి. గూడు లేని వారు వాటిల్లో బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు.

భయాందోళన మధ్య విధులు..

పాత ఇళ్లను కూల్చి వేయాలంటూ చెబుతున్న అధికారులు ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరినా.. వాటిని కూల్చకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. గుత్తేదారులు నాసిరకంగా నిర్మించడంతో కొన్నాళ్లకే ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. కౌటాల తహసీల్దార్, వ్యవసాయ శాఖ కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణాల్లో పదుల సంఖ్యలో కాలం చెల్లిన భవనాలున్నాయి. కాగజ్‌నగర్ పట్టణంలోని ఈఎస్‌ఐ భవనం, కౌటాల ఎంపీడీవో కార్యాలయం, ఐకేపీ ట్రైనింగ్ సెంటర్, ప్రాథమిక సహకార సంఘం భవనాలు ఉరుస్తున్నాయి. వీరవెల్లి, యాపలగూడ, గురుడుపేట, గోవర్‌హెట్టి పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్త భవనం నిర్మించాలి



కౌటాల తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ, ప్రాథమిక సహకార సంఘం, గ్రంథాలయ భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో పలు పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే వారితో పాటు సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదు. శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చి కొత్తవాటిని నిర్మించాలి.
– కె అనిల్, మొగడ్‌దగడ్

ఉన్నతాధికారులకు నివేదించాం



కౌటాల తహసీల్దార్ కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరడంతో వర్షాలకు భవనం ఉరుస్తోంది. దీంతో ధరణి భవనంలో విధులు నిర్వహిస్తున్నాం. ఈ విషయం ఉన్నతాధికారులకు నివేదించాం. కౌటాల మండలం మొగడ్‌దగడ్ గ్రామంలో వర్షాలకు రెండు ఇళ్లు కూలిపోవడంతో నివేదికలు పంపించాం. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండొద్దు.
– వి. ప్రమోద్‌కుమార్, తహసీల్దార్, కౌటాల

‘అకారణంగా విధుల నుంచి తొలగించారు’



వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో సురక్ష సెక్యూరిటీ సర్వీసెస్ కరీంనగర్ అవుట్ సోర్సింగ్ ద్వారా గత 11 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న మమ్మల్ని అకారణంగా తొలగించడంతో ఇబ్బంది పడుతున్నామని సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు బాధితులు గురువారం వినతిపత్రం అందజేశారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు సుద్దాల దేవయ్య మాకు తెలియకుండానే మార్కెట్ కమిటీ పాలకవర్గం సమావేశం ఏర్పాటు చేసి తొలగించారని ఆరోపించారు. మా స్థానంలో ఇతరులను నియమించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దినేష్, రాజేశ్వర్, సంతోష్, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

కౌటాల: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, సీజనల్ వ్యాధులపై పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. క్లోరినేషన్ చేసి తాగునీటిని సరఫరా చేయించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గడువులోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపీవో మహేందర్ రెడ్డి, ఏపీవో పూర్ణిమ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో కోట ప్రసాద్

నష్టపోయిన రైతులకు ఆదుకోవాలి

వాంకిడి: అడ ప్రాజెక్టు నీటి ఉధృతితో నష్టపోయిన జైత్‌పూర్, బోర్దా గ్రామాల రైతులకు పరిహారం చెల్లించి, ఆదుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. గురువారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. గత కొన్ని రోజులు కురిసిన వర్షాలకు అడ ప్రాజెక్టు ఏడు గేట్లు ఎత్తి వేయడంతో జైత్‌పూర్, బోర్దా గ్రామాలకు చెందిన సుమారు 10 మంది రైతులకు చెందిన 30 ఎకరాల్లో పత్తి పంట నీట మునిగిందన్నారు. ఒక్కో ఎకరానికి రూ.50 వేలు పరిహారం ఇవ్వాలన్నారు. వ్యవసాయ అధికారులతో సమీక్షించి ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దుర్గం దినకర్, గొడిసెల కార్తీక్, గేడం టికానంద్, వడ్లూరి మల్లేష్, తిరుపతి, మహేశ్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

‘ఉల్లాస్’పై అవగాహన

కెరమెరి: ఎవరూ కూడా వేలిముద్రలు వేయొద్దనే లక్ష్యంతో ఉల్లాస్ అనే కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పిస్తున్నట్లు ఐకేపీ సీసీలు అన్నారు. మండలంలోని సుమారు 50 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో గురువారం ఉల్లాస్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ప్రతీ రోజు ఉదయం లేదా సాయంకాలం వలంటీర్లు అక్షరాలు, అంకెలు నేర్పిస్తారని నిరక్షరాస్యులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సీసీలు కౌసల్య, ధన్‌రాజ్, జీవన్, శ్యాంరావు, సుభాష్, సుజాత, సత్తయ్య, దస్తగిరి, విజయ్, సంజయ్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీసీ కౌసల్య

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను గురువారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఎమ్మెల్యే కోవలక్ష్మి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి ఆపదలో ఉన్న పేదలకు అండగా నిలుస్తుందనన్నారు. అనారోగ్యం, ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారికి ఉపయోగకారంగా ఉంటుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో ఆర్థిక సాయం అందించేలా చూస్తున్నామని పేర్కొన్నారు.

పరామర్శ

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామానికి చెందిన కొడప నవదీప్(11) బుధవారం రాత్రి పాముకాటుతో మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గురువారం పరామర్శించి, కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. తక్షణ సహాయం కింద రూ. 5వేలు అందచేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, రాజన్న, సంజీవ్, మాజీ ఎంపీటీసీ సాజీద్, చౌదరి తిరుపతి, శ్రీనివాస్, నరేశ్, రామన్న, ఖలీల్ బేగ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ తన అనుచరులతో కలిసి హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌లో గురువారం చేరారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సిర్పూర్ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని, వారికి వెన్నుదన్నుగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. నాయకులు గొలెం వెంకటేశ్, తొగరు ప్రశాంత్, రవికాంత్, లెండుగురె శ్యామ్‌రావు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్

అంగడీ బజార్‌ను కాపాడాలి

దహెగాం: మండల కేంద్రంలోని అంగడీబజార్ కబ్జాలకు గురైందని దీనిని కాపాడాలని మాజీ సర్పంచ్ పుప్పాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. అంగడీ భూమి కబ్జాకు గురైందని, కబ్జా భూమి కాపాడాలన్నారు. అదే విధంగా ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉన్న ఖాళీ స్థలాన్ని బస్టాండ్‌కు కేటాయించాలన్నారు. పాత దహెగాంలో ఆంజనేయస్వామి ఆలయం పేరిట పదమూడున్నర ఎకరాల భూమి ఉండగా.. 2013లో ప్రాణహిత కెనాల్‌లో 5 ఎకరాల భూమి పోయిందన్నారు. పరిహారం వచ్చినా.. వాటి వివరాలను ఆలయ కమిటీ చైర్మన్ ప్రజలకు తెలియజేయడం లేదన్నారు. సమావేశంలో మాజీ ఉప సర్పంచ్‌లు పుప్పాల శ్రీనివాస్, ఎల్కరి ప్రశాంత్, పుల్గం నారాయణ, దేవేందర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈవో గౌసియాబేగం

పెంచికల్‌పేట్: ఎస్ఎమ్ఏఎమ్ పథకంలో మండలానికి వ్యవసాయ పరికరాలు మంజూరు కాగా.. చేడ్వాయి రైతువేదికలో గురువారం రైతుల నుంచి దరఖాస్తులను ఏఈవో గౌసియాబేగం స్వీకరించారు. మండలానికి బ్యాటరీ స్ప్రేయర్లు 177, పవర్ స్ప్రేయర్లు 31, రోటవేటర్లు 12, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్ 2, కల్టిటేటర్ 12, పవర్ వీడర్ 1, బ్రష్ కట్టర్ 2, పవర్ టిల్లర్ 2 మంజూరైనట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

‘జీవో 49 రద్దు చేయాలి’

కౌటాల: జీవో నంబర్ 49ను రద్దు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి రాజేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. సిర్పూర్(టి) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు తన నివాసంలో చేపడుతున్న సత్యాగ్రహ దీక్షకు మద్దతుగా గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం పోడు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో కుంచాల విజయ్, దుర్గం మోతిరాం, మల్లయ్య, సత్తయ్య, వానుపటేల్, తిరుపతి, భూమయ్య, రవీందర్, మధుకర్, వెంకటేశ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.



దీక్ష చేస్తున్న బీజేపీ నాయకులు